www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 1 ఆగస్టు 2024





## తల్లిపాలు శ్రేయస్కరం : జెసి

**ప్రజాశక్తి-రాయచోటి**

పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. బుధవారం తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపే పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బిడ్డ జన్మించిన మొదటి గంటలోనే తల్లి పసుపు రంగులోని పాలు అమృతం లాంటివని, వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు అందుతాయని అన్నారు. వీటికి ప్రత్యామ్నాయం లేదని అందరూ గుర్తించాలన్నారు. పుట్టిన పిల్లల సంపూర్ణ మానసిక వికాసం కేవలం తల్లి పాలతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ కొండయ్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి

# రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలి : జెసి

**ప్రజాశక్తి-రాయచోటి**

రహదారులపై ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి రహదారులపై భద్రత కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌డిఒ భరత్‌చవాన్ సమావేశాన్ని ప్రారంభిస్తూ ఈ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు రహదారులపై ప్రమాదాల వివరాలు, హిట్ అండ్ రన్ కేసులు, రహదారులపై భద్రత అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లపై తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై వివరించారు. జిల్లాలో వివిధ శాఖలలో రహదారులపై భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 2023తో పోలిస్తే 2024 సంవత్సరంలో రహదారులపై ప్రమాదాలు, మరణాలు, గాయాల పాలైన వారి సంఖ్య తగ్గిందని ఆర్‌డిఒ కలెక్టర్‌కు వివరించారు. రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా సాయంత్రం 6 నుంచి 9 గంటల లోపు జరుగుతున్నాయని జాతీయ రహదారులపైనే 50 శాతం పైగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మోటార్ సైకిల్ వాహనాలే ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నాయని, ఈ యేడాది జిల్లాలో పది హిట్ అండ్ రన్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. 65 బ్లాక్ స్పాట్లను గుర్తించామని వాటిమీద తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం జెసి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని శాఖలలో రహదారులపై భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా బైక్‌లు నడిపే వారికి జరుగుతున్నాయని, వారిపై పర్యవేక్షణ పెంచి హెల్మెట్ లేని వారిపై చలానాలను విధించాలని పోలీసులకు సూచించారు. మద్యం తాగి నడిపే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, 18 సంవత్సరాలు నిండని మైనర్లు రహదారులపై వాహనాలను నడపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై భూ ఆక్రమణలను పర్యవేక్షించి వాటిని రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లకు తెలిపారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాపారస్తులతో సమన్వయం చేసుకొని మునిసిపల్ ప్రాంతాలలో వీధుల్లో ఎక్కువ ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐఆర్‌ఎడి మొబైల్ అప్లికేషన్‌ను ఎక్కువగా ఉపయోగించు కోవాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, మునిసిపల్ కమిషనర్లు డిఎంహెచ్‌ఒ కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి-రాయచోటి**

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ డిఆర్‌ఒ సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీరమై పోయిందని అన్నారు. వివిధ మేనేజ్‌మెంట్‌లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా పరిష్కారం కాలేదని తెలి పారు. జిఒ 117 రద్దు చేసి జిఒఎంఎస్ నం.5, తేదీ, 23.04.2021 ప్రకారం టీచర్లను కేటాయించాలని అన్నారు. ఫ్రీ ప్రైమరీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియంను సమాంతరంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పనిభారం తగ్గించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటర్ పైబడి దూరం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించి, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే జరిపించి, మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతి పదికన నియమించి, కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేసి పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలిన్నారు. ఎయిడెడ్ నుంచి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించి, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మినిమమ్ టైం స్కేల్ ఉపా ధ్యాయుల సర్వీసును రెగ్యులరైజ్ చేసి, ప్లస్ టూ పాఠశాలల్లో పిజిటి పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. పాఠశాలలకు రావలసిన అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేసి విద్యుత్ బిల్లులు ప్రభు త్వమే చెల్లించాలని అన్నారు. వేసవి సెలవులలో నాడు-నేడు, ప్లస్ టూ తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలన్నారు. డైట్ కాలేజీల్లో ఉన్న ఖాళీ పోస్టు లను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నింపి డైట్‌లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివమోహన్, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి సి.రాజారమేష్ పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : 'సిటు'



ఎఒకు వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతున్న మునిసిపల్ కమిషనర్ రాంబాబుపై తగు చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. మునిసిపల్ కమిషనర్ రాంబాబు నిరంకుశ ధోరణిని ఖండిస్తూ బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మునిసిపల్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 14 మంది కార్మికులు 2021 డిసెంబర్ ఒకటవ తేదీన దినసరి కార్మికులుగా కార్యాలయంలో విధుల్లో చేరి పట్టణ పరిధిలో చక్కగా పారిశుధ్య పనులు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత మునిసిపల్ కమిషనర్‌హఠాత్తుగా వారిని విధుల నుంచి తప్పుకోవాలని ఆదేశాలు జారీ చేశారని, వారికి సంబంధించిన నాలుగు నెలల జీతభత్యాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని అన్నారు. వీటిపై ప్రశ్నించిన కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఈ పనిని నమ్ముకొని వచ్చిన జీతభత్యాలతో కుటుంబాన్ని నడుపుకుంటూ పిల్లల చదువు, తిండి, బట్ట సమకూర్చుకోగలుగుతూ అద్దె భవనాలలో కాలం వెళ్ళబుచ్చుతున్నారన్నారు. కమిషనర్ రాంబాబు దుశ్చర్యలతో గత నాలుగు నెలల నుంచి వేతనాలు లేక ఇంటి అద్దె కూడా కట్టుకునే స్తోమత లేక కార్మికులు అలమటిస్తున్నారని ఆవేదన చెందారు. శ్రమజీవులైన మున్సిపల్ కార్మికుల పట్ల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు సమంజసం కాదని అన్నారు. వెంటనే కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకొని వేతన బకాయిలు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఒకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకురాలు డి.లక్ష్మీదేవి, కొండయ్య, సుబ్రహ్మణ్యం, నరసింహులు, ధనమ్మ, నరసయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

## -ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య




సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం మూడవ రోజు మదనపల్లె ఎన్వీర్ కల్యాణ మంటపంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై మూడు రోజుల పాటు చర్చలు జరిగాయని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో పాటు కేంద్రంలో విద్యుత్తు బిల్లులు తెచ్చి రైతాంగానికి తీవ్రమైన నష్టం చేశారని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో రైతాంగానికి అవసరమైన చర్యలు తీసుకోలేదని, నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం రైతు సంఘాల నాయకులతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, ఆఫీస్ బేరర్స్ జగన్నాథం, రామచంద్రయ్య, కాటమయ్య, రామానాయుడు, మల్లికార్జున, అప్పల నాయుడు, జమలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.



ఐక్యూ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

## విద్యార్థులకు ఐక్యూ పరీక్ష

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ఫార్మసీ రంగంలో రాణించాలంటే విద్యార్థులు చురుకైన ఐక్యూ కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. బోయినపల్లిలోని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల లో బుధవారం విద్యార్థులకు ఐక్యూ పరీక్ష నిర్వహించారు. ఫార్మసీరంగంలో ఔషధ తయారీలో వినియోగించే వస్తువులు, పరికరాలను ఒక్కొక్కటిగా గుర్తించి వాటిని తిరిగి తమ మేధోశక్తితో అదే క్రమంలో రాసి విద్యార్థులకు సూచించారు. ఈ పరీక్షలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు కే.గణేష్, డి.శుభహాన్‌లు ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపారు. ఈ ఐక్యూ పరీక్షను డాక్టర్ ఎం.ప్రమోద్ కుమార్, మహేంద్ర, జి.వెంకట సౌమ్యశ్రీ, ఎస్.రహమతి, ఎస్ మునిరావు, అధ్యాపక బృందం నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సి.గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి అభినందించారు.

## 4న భూ బాధితుల సమావేశం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ రికార్డుల కాల్చివేతను నిరసిస్తూ 4న రెవెన్యూ భూబాధితులతో సిపిఐ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించబోతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులు కలిసి చేసిన అవినీతి అక్రమాలు బయట పడకుండా ఉండేందుకు ప్రభుత్వ రికార్డులను తగలబెట్టే కుట్రలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టారని అన్నారు. ఈ ఘటన అనంతరం అనేక మంది పేదలు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, మా భూములు మాకు ఇప్పించండంటూ రెవెన్యూ ప్రధాన కార్యదర్శి సిసోడీయాకు ఐదువందలకు పైగా ఫిర్యాదులు అందడం చూస్తే భూకబ్జాలు ఎంతలా జరిగాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యద్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబ శివ పాల్గొన్నారు.

## భావితరాలకు స్ఫూర్తి డొక్కా సీతమ్మ

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

డొక్కా సీతమ్మ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని జనసేన నాయకులు పేర్కొన్నారు. జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు సూచనల మేరకు ఆయన సోదరుడు మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, గాజుల కులాయప్ప, పివిఆర్ కుమార్, సమ్మెట నరేంద్ర, సతీష్ నాయుడు, నారదాసు రామచంద్ర, మౌలా, పత్తి నారాయణలు బుధవారం ఆరవ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడమే ధ్యేయంగా లక్షలాదిమందికి ఆకలి తీర్చిన మహా ఇల్లాలు డొక్కా సీతమ్మ పేరును కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం హర్షణీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.



విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న జనసేన నాయకులు

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేద్దాం : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్**

ప్రపంచ తల్లిపాల వారోత్సావాలను విజయవంతం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఆగస్టు మొదటి వారం 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ఘనంగా ప్రపంచ తల్లిపాల వారో త్సవాలు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, ఎస్ఇఆర్‌పి శాఖల ఆధ్వర్యంలో కలసికట్టుగా నిర్వ హించి విజయవంతం చేద్దామన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొదటి 6 నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడాన్ని పెంచే లక్ష్యాన్ని సాధించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసిఫ్ ప్రోత్సాహం మేరకు నిర్వహిం చుకుంటున్నామని తల్లిపాల వలన కలుగు ప్రయోజనాలు వివరించారు. కాన్పు ఐన మొదటి కొన్ని రోజులు వచ్చే తల్లిపాలు చిక్కగా,పసుపు రంగు లో ఉంటాయని అది బిడ్డకు అమృతం తో సమానమన్నారు. తల్లిపాలలో ప్రోటీన్ లు,విటమిన్‌లు, ఐరన్ సంవృద్ధిగా వుండి రోగాలను ఎదుర్కొనే శక్తి ఉంటాయని తల్లి పాలలో శిశువులు ఆరోగ్యముగా పెరుగుతారు. అపుడే పుట్టిన బిడ్డ యొక్క ప్రేగులకు బలాన్నిచ్చి, జీర్ణశక్తిని పెంచడానికి ఉపయోగ పడతాయి. కామెర్లు, విరోచనాలు వంటి ప్రమాదకరమైన రోగాల నుండి కాపాడతాయన్నారు. తల్లిపాలు బిడ్డకు అత్యంత సహజమైన, సురక్షితమైన, పుష్టికర ఆహారం, సీసాపాలు లేదా పోతా పాలు తాగే పిల్లల కన్నా, తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువ బలంగా ఉంటారని పేర్కొన్నారు. తల్లిపాలు స్వచ్ఛమైనవని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు తేలికగా జీర్ణమవుతాయని తెలిపారు. తల్లిపాలు పిల్లలను శ్వాసకోశ సంబంధ వ్యాధిలైన ఎలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధులు నుండి రక్షిస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలుతాగే పిల్లలకు ధవడలు బాగా బలపడతాయన్నారు. పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ కేన్సరలు రావని తెలిపారు. కాన్పు తర్వాత గర్భాశయం యధాస్థానానికి రావడానికి తల్లిపాలు బిడ్డకు పట్టించడం అవసరమని తెలిపారు. పగలు, రాత్రి కలసి బిడ్డకు కనీసం రోజుకు 8 నుండి 10 సార్లు పాలు ఇవ్వాలన్నారు. నవజాత శిశువుకు తల్లిపాలు ప్రకృతి ఇచ్చిన వరమన్నారు. తల్లిపాలు ఎప్పుడైనా, ఎక్కడైనా ఇవ్వవచ్చని చెప్పారు. తల్లిపాలు శిశువుకు ఇచ్చు తల్లీ బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. 13 శాతం శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ఆధునిక, విదీశీయుల మోజులో పడి ఫాషన్ లకు పోయి తల్లిపాలు బిడ్డలకు ఇవ్వకపోవడం చేయరాదన్నారు.



విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్

## విద్యార్థులకు పోటీతత్వం ఉండాలి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

విద్యార్థులకు పోటీతత్వం ఉండాలని, అప్పుడే ఏ రంగంలో అయినా రాణించగలుగుతారని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి అన్నారు. ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 28న భారతీయ విద్యానికేతన్ పాఠశాలలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీల విజేతలకు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. హిందీ ప్రముఖ రచయిత మున్షి ప్రేమ్ చంద్ జయంతి సందర్భంగా బుధవారం బహుమతుల ప్రధాన కార్యక్రమం సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాటాడుతూ విద్యార్థులు తన కార్యాలయానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను కూడా ఆరవ తరగతి నుండే పోటీలలో పాల్గొనడం, బహుమతులు పొందడం జరిగిందన్నారు. తన పాఠశాల రోజులు గుర్తు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎక్కడ ఏ పోటీలు జరిగినా పాల్గొనడం విద్యార్థులకు ఉండవలసిన ముఖ్య లక్షణమని సూచించారు. మొదటి బహుమతిని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధరణి, ద్వితీయ బహుమతి బి.వి.యన్ స్కూల్ విద్యార్థిని సాదియా, తృతీయ బహుమతి మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతిక అందుకున్నారు. బహుమతులతో పాటు పాల్గొన్న వారందకీ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, హిందీ ఉపాధ్యాయులు చాంద్ భాషా, రాజశేఖర్, అల్లాబకస్ పాల్గొన్నారు.

## ఎంఇఒ ఆఫీసుకు బల్లలు వితరణ

**ప్రజాశక్తి-రాజంపేట:** రాజంపేట ఎస్‌టియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయానికి బల్లలు డొనేట్ వితరణ చేశామని రాష్ట్ర వ్యాయామ అధికారి భానుమూర్తి రాజు తెలిపారు. మండల వనరుల కేంద్రంలో కార్యాలయానికి వచ్చేవారు కూర్చోవడానికి సహాయంగా ఉంటా యన్నారు. సమాజ సేవలో ఎస్‌టియు ఎప్పుడు ముందుం టుందని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుబ్రమణ్యం పేర్కొన్నారు ఎంఇఒలు రఘునాథరాజు, సుబ్బరాయుడు మాట్లాడుతూ బల్లలను సమకూర్చిన దాతలు మండల శాఖ అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి శంకర్ నాయక్, లోకేశ్వర్ రాజును అభినందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మురళి మనోహర్, రీజనల్ కన్వీనర్ నరసింహ, ఎస్‌టియు నాయకులు సుబ్రమణ్యం రాజు, ఓబులేసు, సత్యనారాయణ, సామినాథం, సుబ్బారెడ్డి, భాస్కర్ సూరి, పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు

## ఇందిరమ్మ కాలనీలో అక్రమ కట్టడాలు కూల్చివేత

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మండలంలో కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా అమ్మ చెరువుమిట్ట ఇందిరమ్మ కాలనీలో నాయి బ్రాహ్మణుల ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్లారు. ఆ సమయంలో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కలిసి మా ప్రాంతంలో స్థలాన్ని కబ్జా చేసి అక్రమ కట్టడాలు జరిగినట్లు తెలిపారు. దీనిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని అధికారులకు తెలియజేశారు. అధికారులు విచారణ చేపట్టి అక్రమ కట్టడాలుగా తేల్చారు. బుధవారం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి అక్రమ కట్టడాలను జెసిబి సహాయంతో తొలగించారు. ఇందిరమ్మ కాలనీ ప్రజలు అక్రమ కట్టడాలని తొలగించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాశక్తి-మదనపల్లి**

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.రామలింగారెడ్డి అన్నారు. బుధవారం బీటెక్ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో అంకితభావంతో మెలిగి తమ లక్ష్యాన్ని గుర్తించి విద్యాన భ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సులబమన్నారు. గురువులను తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఇంటర్న్‌షిప్స్, ఆన్‌లైన్ కోర్సులు ఎన్‌పిటిఇఎల్ కోర్సులు చేయాలని కోరారు. కళాశాల డీన్ డాక్టర్ వి.వి.ఎన్.భాస్కర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య యొక్క ప్రాముఖ్యత, వివిధ ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. హెచ్‌ఎస్ హెచ్‌ఒడి డాక్టర్ విజయ భాస్కర్ నాయుడు ఇంజినీరింగ్ విద్యలో ఉన్న సిలబస్, పరీక్ష విధానం గురించి విపులంగా వివరించారు. ఐక్యూఎసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మునిరత్నం తన ప్రసంగంలో నాణ్యమైన విద్యను ఎలా అభ్యసించాలో తెలిపారు. కాలేజీ న్యూస్ లెటర్-24ను ఆవిష్కరించారు. కళాశాల కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి నూతన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల విద్యాధిపతులు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొని నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

## నేటి నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు : డిఇఒ

**ప్రజాశక్తి-రాయచోటి**

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని నేటి నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి డైరెక్టర్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆగస్టు 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డిఇఒ శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 200 రూపాయల అపరాధ రుసుంతో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. డిఇఒ కార్యాలయంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల విధివిధానాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. పదవ తరగతిలో చేరుటకు 14 సంవత్సరాలు నిండిన వారికి, ఇంటర్మీడియట్‌లో చేరుటకు పదవ తరగతి పాసై 15 సం వత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేయుటకు అర్హులని, ఆసక్తి ఉన్న అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.apopenschool.ap. gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ రవికుమార్, జిసిడిఒ రాధా, సిఎంఒ కరుణాకర్ పాల్గొన్నారు.

## నేడు మంత్రిచే పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-రాయచోటి**

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద వివిధ కేటగిరీలకు చెందిన పెన్షన్ లబ్ధిదారులందరికి గురువారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటలకు పట్టణంలోని వీరబల్లిరోడ్డు, ఒకటవ సచివాలయం మాసపేటలో పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. అబ్బవరం, బాదం చెట్టు వీధి, 4వ వార్డు కొత్తపల్లి-3 సచివాలయం, రామాపురం మెయిన్ రోడ్డు వార్డు నెంబర్ 19 సచివాలయం, ఎస్ఎన్ కాలనీ, నామాలగుట్ట దళితవాడలో పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

## విద్యుత్ ఇఇగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు డివిజన్ ట్రాన్స్‌కో ఇఇ వై.చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం స్థానిక ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ముని చంద్ర చిత్తూరుకు బదిలీ అయ్యారు. రాయచోటి నుంచి పీలేరు డివిజన్‌కు బదిలీపై కొత్తగా వచ్చిన ఇఇకి ప్రస్తుత ఇఇ మునిచంద్ర పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా ఆహ్వానంపలికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం పీలేరు డివిజన్ ట్రాన్స్‌కో ఎడిఇలు శివయ్య, సుధాకర్, ఉద్యోగులు, సిబ్బందితో పాటు పుంగనూరు డివిజన్ ఎడిఇ రవి, రాయచోటి డివిజన్ ఉద్యోగులు ఇఇని కలిసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ట్రాన్స్‌కో ఉద్యోగులు ఎస్ఎం రఫీ, గురుశంకర్, పురుషోత్తం, ఎఇ టెక్నికల్ కామాక్షి, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇఇ చంద్రశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

## రికార్డులను భద్రపరచిన సిబ్బంది

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో రికార్డులు క్రమ బద్ధంగా లేకపో వడంతో వాటిని సక్రమ రీతిలో అమర్చాలని కమిషనర్ పిఆర్.మనోహర్ ఆదేశించారు. బుధవారం కార్యాలయపు సిబ్బంది సహ కారంతో ప్రతి సంవత్సరం ఆధారంగా చేసుకొని రికార్డులను వేరుచేసి క్రమ పద్ధతిలో అమర్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా ఉన్న బి.కొత్తకోట నగర పంచాయతీగా రూపాంతరం చెందిందని అన్నారు. ప్రస్తుత రికార్డును ఒక ప్రత్యేక పద్ధతిలో సంవత్సరం వారిగా జత పరచడం సులభంగా ఉంటుందని తెలపడంతో తాము ఆ పనిని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉండి వారి స మస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామని అన్నారు. కార్య క్ర మంలో నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

**ప్రజాశక్తి-బి.కొత్తకోట :** పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ వెల్లడించారు. పట్టణంలోని అన్ని వీధిలోలో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పట్టణంలో ప్రతిరోజూ ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతలను నగర పంచాయతీ శాంటేజింగ్ అధికారి కిరణ్‌కుమార్, ఎఇ రాజేందర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా అంటు వ్యాధులను పారద్రోలాలన్నారు.

## వంద శాతం పింఛన్లు పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-వీరబల్లి**

అధికారుల సూచనలు మేరకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌ను గురువారం ఉదయం 5.30 గంటలకు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని మండలంలోని డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్లకు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అందుబాటులో ఉండాలన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వాలంటీర్లను ఎవ్వరూ వినియోగించవద్దని అన్నారు. అలా వినియోగించిన వారిపైన శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా ప్రతినిధుల కోసం పెన్షన్ పంపిణీ సమయం వృధా చేయ రాదన్నారు. పింఛన్ దారులు దూర ప్రాంతాల్లో ఉంటే వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి స్వగ్రామం వచ్చే విధంగా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు,సూపర్వైజర్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఇళ్ల వద్దకే పింఛన్లు : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-ములకలచెరువు :** మండలంలోని 15 గ్రామపంచాయతీలలో పింఛన్ దారులకు గురువారం ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఇందుకు అధికారుల సిద్ధంగా ఉండాలని ఎంపిడిఒ పోలప్ప సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సచివాలయ కార్యదర్శితో పాటు అధికార యంత్రాంగం ఉదయం ఆరు గంటల నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి సాయంత్రంలోపు వంద శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఎఒఆనంద్ కుమార్, ఇఒఆర్‌డి మోహన్ ప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

**ప్రజాశక్తి-గుర్రంకొండ**

కుక్కల దాడికి 20 గొర్రెలు మృతి చెందిన సంఘటన గుర్రంకొండ మండలం ఏనుగులు చెరువు దగ్గర బుధవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని దౌలత్‌ఖాన్ పల్లికి చెందిన గొర్రెల కాపరి ప్రసాద్ ఏనుగుచెరువు దగ్గర చిన్నపాటి పాక వేసుకొని గొర్రెలను రాత్రివేళ అక్కడ ఉంచుకొని సంరక్షించుకుంటున్నట్లు తెలిపారు.. ప్రతిరోజూ లాగే బుధవారం గొర్రెలను పాకలోకి తోలి ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. గుంపుగా వెళ్లిన కుక్కలు మందలో జొరబడి 20 గొర్రెలను కొరకడంతో అక్కడికక్కడే గొర్రెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం తరపున తమకు న్యాయం చేయాలని కోరారు.

**In the Court of the Hon'ble Additional Junior Civil Judge, Kadiri**
**O.S.No:58/2022.**

**Between:-**

1) Gurramkonda Eswaraiah S/o Venkataramana, aged about 56 years, Hindu, Agriculturist, residing at D.No:1-1132-2G-3-1, Adapala Street, Kadiri Town and Mandal, No email ID.Mobile No.7093677231,

2) Gurramkonda Subbaiah S/o Venkataramana, aged about 45 years, Hindu, Agriculturist, residing at D.No:1-317, Pedaballi Road, NP Kunta, NP Kunta Post & Mandal, email ID.Mobile No.8106698757. **...Plaintiffs.**

**And**

Rangani Narayana & others.

**...Defendants.**

**Suit Summons to Defendants No.2 to 4**

2) Rangani Umadevi w/o late R.Jayappa @ Jayachandra, aged about 35 years, Hindu, agriculturist, residing at Door No.15-17, Balaji Street, , B.Kothakota, B.Kothakota post and Mandal, Chittoor District. No email ID. Mobile No. not known.

3) Rangani Bhargavi d/o late R. Jayappa @ Jayachandra, aged about 22 years, Hindu, agriculturist, residing at Door No.15-17, Balaji Street, B.Kothakota, B.Kothakota post and Mandal, Chittoor District. No email ID. Mobile No. not known.

4) Rangani Bujji d/o late R. Jayappa @ Jayachandra, aged about 20 years, Hindu, agriculturist, residing at Door No.15-17, Balaji Street, B.Kothakota, B.Kothakota post and Mandal, Chittoor District. No email ID. Mobile No. not known

**...Defendants 2 to 4**

పై దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు భాగపరిష్కార నిమిత్తము పై కోర్టు వారి ఎదుట దావా దాఖలు వేసి వున్నారు. సదరు దావాను 07/08/2024కు వాయిదా వేసినారు. మీకు అభ్యంతరములు వున్న యెడల స్వయముగా కానీ, వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట పై తేదిన ఉదయం 10:30 గంటలకు హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకోవలెయును.లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానము చేయబడును అని తెలియజేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

వాయిదా తేది:07/08/2024
స్థలం:కదిరి

**బండారు క్రిష్ణమూర్తి, M.A.,LL.B.,**
వాదులపరం న్యాయవాది,కదిరి
సెల్:9618465758

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు తోపురెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి ప్రసాద్ ఎరువుల అంగడి కాంప్లెక్స్‌లో మత్తుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన తోపురెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసై దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడు చేసుకుంటున్నారని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జయరాం, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల ఓబులేసు, ఫకీరయ్య ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి కార్యకర్తలు నాగరాజు అసెంబ్లీ కార్యదర్శి లాయర్ సిద్దయ్య పాల్గొన్నారు.



# మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు


మామిడిలో యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్‌శ్రీనివాసులు

**ప్రజాశక్తి-కలికిరి**

ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన గత ఏడాది రాష్ట్రంలో పూత ఆలస్యంగా వచ్చి, అకాల వర్షాలు, వేగంగా వీసే గాలి కారణంగా పంట నష్టం వాటిల్లడంతో ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గిందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల పేర్కొన్నారు. రాష్ట్రంలో మామిడిని రైతులు చాలా సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదని, మామిడి రైతులు కోత తరువాత నెలవారి పద్ధతిలో సరైన యాజమాన్యం పాటించడం ద్వారా వచ్చే ఏడాది పూత సక్రమంగా రావడంతో పాటు అధిక దిగుబడులు పొందటానికి అవకాశం ఉంటుందని అన్నారు. కలికిరి మండలం గుండ్లూరు, ఆసిపిరెడ్డి గారిపల్లి గ్రామాల్లో మామిడి తోటలు పరిశీలించి ప్రస్తుతం పాటించవల్సిన యాజమాన్య పద్ధతులు గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు వివరించారు. కాయ కోత అనంతరం, 15-20 రోజులకు కొమ్మ కత్తిరింపులు జరపటం వల్ల కొత్త చిగుళ్ళు వస్తాయని అన్నారు. సూక్ష్మ మూలకమైన జింక్ సల్ఫేట్ పిచికారి చేయడం వలన మామిడి చెట్లు త్వరగా పూతకి వచ్చే అవకాశం ఉందన్నారు. తొలకరి వర్షాలు పడగానే, నేలలో పదును చూసుకొని వరుసల మధ్య మొదటి సారి దున్నితే కలుపు నివారణ జరగటంతో పాటు, భూమిలో ఉన్న కీటకాల గుడ్లు, నిద్రావస్థలో ఉన్న పురుగులు బయటపడి ఎండ వేడికి నశిస్తాయని అన్నారు.కలుపు పెరగకుండా పచ్చి రొట్ట పంటలైనా జీలుగా, జనుము, పిల్లి పెసర, పెసర, ఉలవలను ఎకరాకు 15-20 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలని, పచ్చి రొట్ట పైరు వేయటం వలన తోటలో సేంద్రీయ కర్బనం శాతం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. వర్ష కాలం చివర్లో రెండవ సారి పొలాన్ని దున్నాలని దీని వల్ల నేల గుల్ల బారి నేల లోపలి పొరల్లోని తడి ఆవిరై పోతుందని, ఇలా తేమ ఆవి రైపోవటం వల్ల చెట్లు బెట్టకి వచ్చి పూత రావటనికి దోహద పడుతుందన్నారు.

## బెట్ట నివారణకు అధికారుల సూచనలు పాటించాలి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి :** వేరుశనగలో బెట్ట నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాధారంగా మండల వ్యాప్తంగా 820 ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ పంటను రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో సకాలంలో తగినంత వర్షం కురవకపోవడంతో వేరుశనగ పంట బెట్టకు గురై ఎండిపోయే అవకాశం ఉందని అన్నారు. ఈ ప్రభావాన్ని కొంతమేర తట్టుకోవడానికి రైతులు రెండు శాతం యూరియా ( ఒక్క లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా ) చొప్పున కలిపి ద్రావణాన్ని వేరుశనగ పంట పై పిచికారి చేయాలన్నారు. ఈ విధంగా పిచికారి చేయడం వలన పంట సుమారు 15 రోజులపాటు బెట్టను తట్టుకొని పంటను సంరక్షించుకోవచ్చన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

## వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-కలకడ**

వేరుశనగ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించినట్లు వాల్మీకిపురం సహాయ సంచాలకులు వాణిశ్రీ తెలిపారు. బుధవారం మండలంలోని దేవులపల్లి పంచాయతీ దేవలపల్లికి చెందిన 30మంది రైతులకు వేరుశనగ పంట సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు. పంట వేయడానికి ముందు విత్తనశుద్ధి ఎలా చేయాలి, ఎలాంటి ఎరువులు వేయాలన్న అంశాలపై రైతులకు సూచనలు, సలహా ఇచ్చినట్టు తెలిపారు. పంట నష్టం కలిగించే వేరు పురుగుల నివారణకు వానపాములు, వృద్ధి చేయడం కీటక సంహారక మందులు వాడడం, కృత్రిమ ఎరువులను తయారుచేసి ఎలా వినియోగించాలనే అంశాలపై రైతులతో చర్చించినట్లు తెలిపారు. అంతర పంటగా వేరుశనగ వేసే రైతులకు తీసుకోవాలని జాగ్రత్తల గురించి, వాటికి వాడవలసిన క్రిమిసంహారక మందులు ఎలాగా పిచికారి చేయాలనే అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, గ్రామ వ్యవసాయ సేవకులు శివకుమార్, కొలబ నేటర్ రాజేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ వాణిశ్రీ

# పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**ప్రజాశక్తి-వీరబల్లి**

లయన్స్ క్లబ్ రాయచోటి ఆధ్వర్యంలో కోశాధికారి లయన్ జి.కిషోర్ కుమార్‌రెడ్డి కొడుకు షణ్ముఖరెడ్డి, ఆయన తమ్ముడి కూతురు జశ్వితారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని మట్లి, సీతంపేట, కొత్తపల్లిలో ఉండే మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్, ఎరేజర్స్, షార్ప్‌నర్స్ , జామింట్రి బాక్స్ లు సర్పంచ్ నాగార్జున చారి, ఎంఇఒ కృష్ణయ్య, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో లయన్స్ క్లబ్ తర పున ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. అనంతరం సర్పంచ్ నాగార్జు నచారి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తరఫు వారు విద్యార్థులకు పుస్తకాలు వితరణ చేసినం దుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలు వారు అందించే ఈ సహ కారంతో పాటు పిల్లలు కూడా బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. భవిష్యత్తులో కూడా మరింతమంది పేద పిల్లలను లయన్స్‌క్లబ్ ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి లయన్ క్లబ్ షేక్ ఇందాద్ అహమ్మద్, సభ్యుడు లయన్ పవన్ కుమార్ నాయుడు, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, అధ్యాపకులు వెంకట్ రామరాజు,వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు

**ప్రజాశక్తి-కంభంవారిపల్లి**

కెవి.పల్లి మండలంలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సరిపడే పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం కళాశాలకు అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చెన్నకేశవులు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ ఆంజ నేయులు, అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, శేఖర్, అన్నపూర్ణ, హరినాథ్, సయ్యద్‌బాషా, రామకృష్ణ, షకీల్ అహ్మద్, కొండయ్య, నాగరాజ, నాగేంద్ర, నాగరాజ నాయక్, భారతి, తనూజ పాఠ్య పుస్తకా లను విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపల్ చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని, రాబోయే పబ్లిక్ పరీక్షలలో వందశాతం ఫలి తాలు సాధించాలని కోరారు.

# ఉద్యోగికి విరమణ తప్పనిసరి : ఎంపిడిఒ


కలికిరి : వేమనారాయణను సన్మానిస్తున్న ఎంపిడిఒ

**ప్రజాశక్తి-కలికిరి**

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని ఎంపిడిఒ రామకృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం కలికిరి ఎంపిడిఒ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన వేమనారాయణను సతీ సమేతంగా ఎంపిడిఒ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, స్నేహితులు, బంధుమిత్రులు, ఉద్యోగులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సంధ ర్భంగా జరిగిన సమా వేశంలో వారు మాట్లా డుతూ 32 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ ప్రయాణంలో వేమనా రాయణ చేసిన సేవలు అద్వితీయమని అన్నారు. సున్నిత మనస్కుడు, మంచి స్వభావం, మంచి గుణం, అందరితో ప్రేమ అభిమానం కలిగిన మన స్తత్వం ఆయనకు సొంతమని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనం దంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కరీముల్లా, నాగా ర్జునరెడ్డి, మదనపల్లి, పీలేరు డివిజన్‌లోని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, స్నేహితులు, సన్నిహితులు, కలికిరి పంచాయతీ సిబ్బంది, సెక్రెటరీలు, కుటుం బ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## వెలుగు సిసికి సన్మానం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.ప్రకాష్ సిసి ఉద్యోగ విరమణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరి యా కో-ఆర్డినేటర్ నిరంజన్‌కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది మాట్లాడుతూ ప్రకాష్ విధి నిర్వహణలో నిక్కచ్చిగా, నిజాయితీగా పనిచేశారని పేర్కొన్నారు. ఇలాంటి సిసి పదవి విరమణ పొందడం బాధా కరమని స్థానిక ఏపిఎం సుబ్బా లక్ష్మమ్మ తెలియ జేశారు. ఉద్యోగ రీతిలో పదవీ విరమణ అనేది ఒక అధ్య యనం అని తెలిపారు. ప్రకాష్ దంపతులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వెలుగు సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎపి ఎం సుబ్బలక్ష్మి, ఏరియా కో-ఆర్డినేటర్ పెనగ లూరు ఎపిఎం నిరంజన్ కుమార్, ఓబుల వారిపల్లి ఎపిఎం ఆర్ముగం, కోడూరు ఏపిఎం రవికుమార్, క్లస్టర్ సిసిలు పాల్గొన్నారు.


పుల్లంపేట: సిసి ప్రకాష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

## రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్‌రావు సేవలు ఎనలేనివి

**ప్రజాశక్తి-నందలూరు**

సీనియర్ రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు గత 40 సంవత్సరాలుగా రైల్వే ఉద్యోగులకు చేసిన సేవలు ఎనలేనివని పలువురు ప్రముఖులు కొనియాడారు. మండలంలోని పాటూరు పంచాయతీ ఎర్రి పాపయ్యగారిపల్లె గ్రామంలోని విభ ఏరుడైట్ పబ్లిక్ స్కూల్‌లో డాక్టర్ జయ భాస్కర్‌రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, గుంతకల్లు డివిజన్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, డిఒఎం శ్రావణ్ కుమార్, ఐఆర్‌టిఎస్ మనోజ్, విశ్రాంత పి ఎస్ ఎండి ఎండి నాయక్, రిటైర్డ్ సిఎంఎస్ ప్రభా కర్‌రాజు, రిటైర్డ్ ఎమ్మెస్ విజయకుమార్, విశ్రాంత మెడికల్ ఆఫీసర్లు నారాయణయ్య, పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఏలూరు వాసి మృతి

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై వాల్మీకిపురంలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం చక్రాయగూడెం గ్రామానికి చెందిన పదిలం శీను(41) తన వ్యాపార నిమిత్తం ఏలూరు నుంచి చాక్లెట్ తయారీ సామగ్రిని ఐషర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు తీసుకెళ్లి అక్కడ సామగ్రి దించి, తిరిగి అదే లారీలో దారాపూర్ నుంచి హైదరాబాద్‌కు టెంకాయాలను లోడ్ చేసుకుని డ్రైవర్ రెడ్డెప్ప బయలుదేరాడు. మార్గమధ్యంలో పదిలం శీను కూడా లారీ ఎక్కి తాను ఏలూరుకు వెళ్లే మార్గమధ్యమలో దిగాలనుకున్నాడు. అదే సమయంలో డ్రైవర్ రెడ్డెప్ప వాల్మీకిపురం మీదుగా రావడం వేకువజామున పట్టణంలోని తన నివాసానికి వెళ్లి రావడానికి స్థానిక బైపాస్ రోడ్డులో ఓ పక్కగా లారీని ఆపి వెళ్ళాడు. లారీ నివాసాలకు అడ్డుగా ఉందని స్థానికులు చెప్పడంతో ఎంతకీ డ్రైవర్ రెడ్డెప్ప రాకపోవడంతో ఉదయం 6గంటల సమయంలో లారీలో ఉన్న పదిలం శీను నెమ్మదిగా లారీని కొంచెం ముందుకు తీసుకెళ్లి నిలిపాడు. ఆ సమయంలో లారీకి విద్యుత్ తీగలు తగిలి ఉన్నాయి. గమనించకుండా లారీ దిగిన శీను బహిర్భూమికి వెళ్లేందుకు కిందకు దిగగానే అప్పటికే లారీ పైభాగాన్ని విద్యుత్ తీగలు తాకి ఉండటంతో ఒక్క సారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిఐ పులి శేఖర్, ఎస్ఐ నాగేశ్వర్ రావు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టారు. శీను మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బైపాస్ రోడ్డులో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటమే కాకుండా విద్యుత్ మెయిన్ లైన్ తీగలు కిందకు వేలాడటమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ పులిశేఖర్


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయి వికాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ గౌరీ శంకర్ విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తేక్వాండో అసోసియేషన్ ఎస్ వికె స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలోతేక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు వారు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆటల పోటీలలోనూ నైపుణ్యం సాధించాలని, క్రీడ లతో శారీరిక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీ గౌరీశంకర్ విద్యాలయ కరస్పాండెంట్ గోపీనాథ్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌వికె స్పోర్ట్స్ మాస్టర్ పి.శివాజీ పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో సర్పంచ్..

**ప్రజాశక్తి-కలకడ:** మండలంలోని కదిరే చెరువు పంచాయతీ కదిరాకు చెందిన సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న తనదైన శైలిలో గ్రామంలో ఉన్న మురికినీటి కాలువలను శుభ్రం చేసి పారిశుధ్య పనులకు నడుం బిగించారు. సర్పంచ్ తన పంచాయతీ సిబ్బందితో కలిసి కాలువలో ఉన్న చెత్తాచెదారం, మురికి నీటిని తొలగించి పారిశుధ్య పనులు నిర్వహించారు.

# క్రైం కార్నర్

## బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**


నవీన్ కుమార్ (ఫైల్ ఫొటో)

ఉరేసుకొని బిటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం, రామిగానిపల్లికి చెందిన మధుసూదనరెడ్డికి ఒక్కగానొక్క కొడుకు నవీన్ కుమార్(19) తిరుపతిలోని ఓ ప్రయివేట్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడు. ఇటీవల వెలువడిన మొదటి సంవత్సరం బీటెక్ ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై తిరుపతి కళాశాల నుండి మంగళవారం సాయంత్రం ఇంటికి బయల్దేరాడని చెప్పారు. మార్గమధ్యంలోని మదనపల్లె మండలం సిటిఎంలో బస్సు దిగి అంగళ్ళు రోడ్డులో కొంచెం దూరం వెళ్లి రాత్రి 8.30 తల్లిదండ్రులకు ఫోన్ చేసాడని తెలిపారు. కాలేజీలో చెప్పే పాఠాలు తనకు సరిగ్గా అర్థం కావడం లేదని, రెండు సబ్జెక్ట్‌లు ఫెయిలయ్యానని బాధపడ్డాడు. తల్లిదండ్రులు ధైర్యం చెప్పిన తరువాత మళ్లీ మాట్లాడుతానని ఫోన్ పెట్టేశాడని అన్నారు. క్షణికావేశంలో రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. ఉదయాన్నే గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అంది ంచారని అన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి మృతుడి తలిదండ్రులకు సమాచారం అందించారని అన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శేఖర్ తెలిపారు.

## వ్యక్తి దారుణ హత్య

**ప్రజాశక్తి-కలకడ**

వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కది రాయచెరువు పంచా యతీ కదిరా యిచెరువుకు చౌడేశ్వరి అమ్మవారి ఆల యం వీధికి చెందిన ఉసిరి కా యల రామచంద్ర(45) ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్ర హత్య చేసినట్లు మృతుడి భార్య లలిత పోలీ సులకు ఫిర్యాదు చేసింది.స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మృతుడు రామ చంద్ర తన కుమారుడు వినోద్ కుమార్ మంగళవారం రాత్రి తమ గ్రామ సమీ పంలో ఉన్న వడ్డీపల్లి వద్ద గల వ్యవసాయ పొలానికి సమీపంలో ఉన్న రేకుల షెడ్డు వద్ద నిద్రిస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతని దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. అదే సమయంలో మృతుడు కుమారుడు రేకుల షెడ్డు దగ్గర ఉన్న గదిలో దాక్కొని ఉండినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. అనంతరం బుధవారం ఉదయం మృతుడు కుమారుడు వినోద్ ఇంటికి వెళ్లి తన అమ్మకు విషయం తెలపడంతో ఆమె సంఘటన స్థలానికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రాయచోటి డిఎస్‌పి రామచంద్రరావు, కలకడ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి తమ సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తయారు చేస్తున్నట్లు ఎస్ఐ రామ కృష్ణారెడ్డి తెలిపారు. డిఎస్‌పి రామచంద్రరావు హత్య చేసిన వ్యక్తులను గుర్తించాలని సిఐ, ఎస్ఐలను ఆదేశించినట్లు తెలిపారు.

## హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ బుధవారం సెకెండ్ ఎడిజె అబ్రహాం తీర్పు చెప్పారు. రెండో పట్టణ సిఐ యువరాజు తెలిపిన వివరాల మేరకు.. 2016 ఆగష్టు 8 న పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి రైస్ మిల్లులో వంకర సుబ్రహ్మణ్యం భార్య సురేఖతో గొడవ పడుతుండటంతో మణికంఠ, రాజేష్‌లు అడ్డుకోగా సుబ్రహ్మణ్యం కత్తితో దాడి మణికంఠను హత్య చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, రూ. 4వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని అన్నారు.

## తుపాకీతో కాల్పులు జరిపిన వ్యక్తి అరెస్టు

### - నాటు తుపాకీ, కొడవలి స్వాధీనం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

తుపాకీతో కాల్పులు, కొడవలితో దాడి చేసిన నిందితున్ని బుధవారం మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి అరెస్టు వివరాలను వెల్లడించారు. మదనపల్లె మండలం, వలస పల్లె పంచాయతీ అరవవాండ్ల పల్లెకు చెందిన లక్ష్మయ్య కుమారుడు దివాకర్ అన్న పురుషోత్తంలకు కొద్ది కాలంగా ఆస్థి తగాదాలు ఉన్నాయని అన్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకున్న దివాకర్ 28న ఆదివారం రాత్రి స్థానిక నవోదయ పాఠశాల వద్ద అన్నా వదినలతో గొడవ పెట్టుకున్నాడు. ఈ సమయంలో వదిన రెడ్డమ్మ తమ్ముడు రెడ్డిప్రవీణ్‌పై నాటు తుపాకీతో కాల్పులు జరపడంతో అతని కాలులోకి రవ్వలు దూసుకెళ్లి గాయపడ్డాడు. అడ్డుకున్న ఆనంద్ అనే వ్యక్తిపై కొడవలి దాడి చేసి గాయప రిచాడని తెలిపారు. గాయపడిన బాధితులను స్థానిక సర్వజన బోధన ఆసుపత్రికి తరలిం చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడు దివాకర్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ శేఖర్, ఎస్ఐ రవికుమార్, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.


నిందితుడి అరెస్టును చూపుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి